సాక్షి తిరుపతి



1

గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా సచ్చిదానందమూర్తి



తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జిగా ప్రొఫెసర్ సచ్చిదానంద మూర్తిని నియమిస్తూ వీసీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేసిన డాక్టర్ కంభంపాటి సాంబశివమూర్తి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సాంబశివమూర్తి సేవలను కొనియాడారు. అనంతరం సచిదానందమూర్తికి అభినందనలు తెలిపారు.

నౌకా మరమ్మతు కేంద్రానికి భూ పరిశీలన



భూములను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వాకాడు : మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్ర తీరంలో నిర్మించనున్న షిప్ బిల్డింగ్ రిపేర్ సెంటర్‌కు అవసరమైన భూములను బుధవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, కేంద్ర బృందం, పోర్టు అథారిటీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ మాట్లాడుతూ మ్యాప్‌ల ఆధారంగా భూముల వివరాలను తెలిపారు. నౌకా మరమ్మతు కేంద్రానికి తూపిలిపాళెం తీరం అనువైన ప్రదేశంగా కేంద్ర బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు స్విమ్స్ జట్టు



క్రీడాకారులతో స్విమ్స్ వీసీ, అధికారులు

తిరుపతి తుడా: కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో ఈనెల 4 నుంచి 7వ తేదీవరకు నిర్వహించనున్న సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు స్విమ్స్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎస్.మనోజ్ కుమార్ ఎం.సునీల్ కుమార్, నాగార్జున, శివరంగా, నవీన్ సింగ్, వెంకట గణేష్, ఉదయ్ కుమార్, మల్లిఖార్జున, భరత్ కుమార్ (స్విమ్స్ నర్సింగ్ కాలేజ్), శ్రవణ్ కుమార్, లోకేష్, అమీర్, వెంకటేష్, తేజేశ్వర్ (హెల్త్ సైన్సెస్)కు జట్టులో స్థానం కల్పించారు. పోటీలలో తమ జట్టు విజయం సాధించాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్. బిట్లా, స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ కేఆర్ శుభాష్, సభ్యులు పి.విశ్వనాథ్‌రెడ్డి, పీడీ బీపీ మధుబాబు కోరారు.

పక్షుల కేంద్రంలో టికెట్ కౌంటర్



టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ప్రవేశ టికెట్లకు బుధవారం కౌంటర్ ప్రారంభించారు. వన్యప్రాణి విభాగం అధికారులు మాట్లాడుతూ వలస విహంగాల సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అయితే కేంద్రంలోని మూడు చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో విహంగాలు రాలేదని, ఈ క్రమంలో టికెట్ కౌంటర్ ప్రారంభించి ప్రయోజనం ఏంటని పక్షి ప్రేమికులు అభిప్రాయపడడం గమనార్హం

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,275 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,973 మంది తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

మనోరథం తీరేలా..
కల్కి కటాక్షం









బ్రహ్మోత్సవ వేళ.. బ్రహ్మాండనాయకుని దర్శించిన వారిది కదా భాగ్యము.. భువి వైకుంఠంలో అడుగిడిన వారిది కదా పుణ్యము.. ఆనంద నిలయంలో దేవదేవుని కనులారా కాంచిన వారి జన్మము కదా ధన్యము.. మహిమాన్విత రథంపై మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీమలయప్పస్వామివారిని సేవించిన వారు కదా పునీతము.. గోవింద నామస్మరణతో పులకించిన వారిది కదా ముక్తిమార్గము.. అశ్వ వాహనంపై కల్కి అవతారంలో విహరిస్తున్న అలంకారప్రియుని కటాక్షం పొందిన వారి జీవితము కదా చరితార్థము.

- అంగరంగ వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- రథంపై ఊరేగిన దేవదేవేరులు
- అశ్వవాహనంపై విహరించిన శ్రీమలయప్పస్వామివారు
- నేడు చక్రస్నానం.. ధ్వజావరోహణం

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం శ్రీమలయప్పస్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో కూడిన వైకుంఠనాథుడు చతుర్మాడ వీధుల్లో రథంపై ఊరేగారు. శ్రీనివాసుని దివ్యదర్శనంతో భక్తులు పులకించారు. రథోత్సవంలో దేవదేవుడిని సేవించిన వారికి పునర్జన్మ ఉండదని పురాణాల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అశేష భక్తజనులు గోవిందనామస్మరణల నడుమ మహారథం లాగుతూ తన్మయత్వం చెందారు. రాత్రి అశ్వవాహనంపై మలయప్పస్వామివారు కల్కి అవతారంలో విహరించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

చక్రస్నానానికి పకడ్బందీ ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేకువజామున 3 గంటల నుంచి పల్లకి ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం జరిపించనున్నారు. అనంతరం వరాహస్వామి ఆలయంలో దేవదేవేరులు, చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం చేపట్టనున్నారు. .అనంతరం పవిత్ర పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం చేయనున్నారు. చక్రస్నానం సందర్భంగా టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్ఓ మురళీకృష్ణ, జేఈఓ వీరబ్రహ్మం పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ పుష్కరిణిలో 9,400 మంది పుణ్యస్నానమాచరించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

స్విమ్స్‌లో మెడికల్ మాఫియా!

- పద్మావతి ఆస్పత్రి మందులషాపు కేటాయింపులో కిరికిరి
- టీటీడీకి రూ.57లక్షలు ఎగ్గొట్టిన వ్యక్తికి కట్టబెట్టేందుకు ఎత్తులు
- ఒత్తిడికి తలొగ్గి డిపాల్టర్‌కు అనుకూలంగా టీటీడీ చైర్మన్ ఆదేశాలు?





సాక్షి టాస్క్ ఫోర్స్: టీటీడీ పరిధిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మెడికల్ మాఫియా రాజ్యమేలుతోంది. ఇప్పటికే ఇక్కడి మందుల షాపులో నాణ్యమైన మందులు లేవని, జనరిక్ స్థానంలో ఖరీదైన మందులను రోగులకు అంటగడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటి ఆధారంగానే ఇటీవల సదరు మందుల దుకాణం నిర్వహిస్తున్న ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీకి టీటీడీ నోటీసులు కూడా జారీ చేసింది. అయినప్పటికీ కంపెనీ యజమాని తన రాజకీయ పలుకుబడితో నోటీసులను లెక్కచేయలేదు. టెండర్ రూల్స్‌కు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడి అండదండలతో కంపెనీ యజమాని రెచ్చిపోతున్నాడు. సిమ్స్ ఓపీ , డాక్టర్స్ క్యాంటీన్ పక్కన గతంలో ఉన్న జనరిక్ మందుల షాపులు రోగులకు సౌకర్యంగా ఉండేవి. అత్యవసర విభాగం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహానికి కుడి పక్కన ఉన్న ఇన్నొవేటివ్‌వీ ఫార్మా కంపెనీకి చెందిన మెడికల్ షాప్ మేలు కోసం ఆ రెండు జెనరిక్ షాపులను తొలగించారు. ఈ మందుల దుకాణం నిర్వహణ తీరు స్విమ్స్ అధికారులకు సైతం తలనొప్పిగా మారింది. ఇది చాలదన్నట్టు పద్మావతి ఆస్పత్రి సమీపంలోని మరో మెడికల్ షాపును సైతం ఇన్నొవేటివ్‌వీ ఫార్మా యజమాని దక్కించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. రాజకీయ నేతలను రంగంలోకి దింపి టీటీడీ చైర్మన్‌ను సైతం మెప్పించి, ఒప్పించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సదరు మెడికల్ ఏజెన్సీకి టెండర్ ఫైనల్ చేయాలని టీటీడీకి అనధికారిక ఆదేశాలు అందినట్లు సమాచారం.

ఆ కంపెనీపై ఎందుకు అంత ప్రేమ

టీటీడీని నకిలీ డాక్యుమెంట్లతో (బ్యాంకు గ్యారంటీతో) మోసం చేయడంతోపాటు అద్దెను సకాలంలో చెల్లించకుండా డిఫాల్టర్ గా ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీ ముద్ర వేసుకుంది. ఇవన్నీ పక్కనపెట్టి సదరు కంపెనీకే పద్మావతి మెడికల్ షాప్‌ను కట్టబెట్టాలని జనసేన పార్టీ నేతలు రంగంలోకి దిగారు. డిఫాల్ట్‌గా ఉన్న సంస్థను పక్కనపెట్టి టెండర్ ఓపెన్ చేసిన ఒకటి రెండు రోజుల్లోనే తర్వాత ఎక్కువ కోట్ చేసిన ఫార్మా కంపెనీకి మెడికల్ షాపును అప్పగించాల్సి ఉంది. అయితే టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా నెలకు పైగా ఓపెన్ చేసిన టెండర్‌ను ఖరారు చేయకుండా కాలయాపన చేయడం వెనక దాగిన కుట్రను తేటతెల్లం చేస్తోంది. ఈ మెడికల్ షాపు కేటాయింపు వెనుక భారీ మొత్తం చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డిపాల్టర్‌గా ముద్ర

స్విమ్స్ అత్యవసర విభాగం సమీపంలోని మెడికల్ షాపును ఈ ఏడాది జనవరి నుంచి ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీ చేజిక్కించుకుని పలు ఆరోపణల నడుమ నడుపుతోంది. స్విమ్స్ పరిధిలో కొంత కాలం వరకు మరో మెడికల్ షాపు లేకుండా చక్రం తిప్పి పుష్కలంగా ఆదాయం పొందుతోంది. ఈ క్రమంలోనే రాజకీయ నేతలకు అడిగింది ఇచ్చుకుని పద్మావతి ఆస్పత్రిలోని పద్మావతి మెడికల్ షాపును కూడా దక్కించుకునేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మందుల దుకాణానికి రెండు నెలల క్రితం టీటీడీ టెండర్ పిలిచింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్నవాళ్లు కేవలం ముగ్గురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టు 25వ తేదీన టెండర్ ఓపెన్ చేశారు. సదరు ఫార్మా కంపెనీ అత్యధిక కోడ్‌తో మొదటి వరుసలో నిలిచి టెక్నికల్‌గా అర్హతను కోల్పోయింది. టీటీడీలో ఇప్పటివరకు నిధులను ఎగ్గొట్టిన వారు టెండర్ తగ్గించుకునేందుకు అనర్హులు. ఇప్పటికే నడుపుతున్న మెడికల్ షాపునకు సంబంధించి టీటీడీకి రూ. 57 లక్షలకు పైగా సకాలంలో చెల్లించకుండా ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఎగ్గొట్టింది. అలాగే టీటీడీకి ఇవ్వాల్సిన రూ.5కోట్ల బ్యాంకు గ్యారంటీని పాత మెడికల్ షాపునకు సంబంధించిన గ్యారెంటీనే కొత్త అటెండర్‌లోనూ చూపించింది. టెండర్ ఓపెన్ చేయక ముందే మోసం చేసిన కంపెనీని పక్కన పెట్టాల్సిన టీటీడీ అధికారులు ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పై రెండు అంశాల తో ఆ సంస్థ డిఫాల్టర్‌గా ముద్రపడింది. రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గిన టీటీడీ అధికారులు అనర్హత కలిగిన కంపెనీకే మెడికల్ షాపును అప్పగించేందుకు పావులు కదపడం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు టీటీడీ చైర్మన్ సైతం డిఫాల్ట్ కంపెనీకే కేటాయించేలా అధికారులకు సూచనలు చేయడం వివాదానికి మరింత ఆజ్యం పోస్తోంది. సదరు కంపెనీ ఎక్కువ కోట్ చేసిందనే సాకును చూపి, డిఫాల్టర్ అనే విషయాన్ని పక్కన పెట్టడంపై కొందరు కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది.

కూటమి ‘కోతలు’!



- మళ్లీ 355 పింఛన్ల తగ్గింపు
- రేషన్ దుకాణాల్లో బియ్యంతో సరి

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అందించే పథకాల్లో యథేచ్ఛగా కోత పెడుతోంది. ముందుగా సామాజిక పింఛన్లను ప్రతి నెలా తగ్గించేస్తోంది. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు మొత్తం 12,566 పింఛన్లు తొలగించింది. ఈ నెలలో 355 మందికి లబ్ధిదారులకు రిక్తహస్తం చూపింది. 8 వేల మంది వితంతువులకు కొత్తగా పింఛన్ మంజూరు చేయకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటోంది. అర్హులైన 10వేల మందికి పైగా దివ్యాంగులను ఆశనిరాశల నడుమ వేధిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై శీతకన్ను వేసి ఉసురు పోసుకుంటోంది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని దాదాపు 17 నెలలుగా రోడ్ల పాలు చేసేసింది.

కందిపప్పు ఊసేలేదు...

రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు పూర్తిగా ఇవ్వడం లేదు. చక్కెరను కూడా అంతంతమాత్రంగానే అందిస్తున్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో సక్రమంగా రేషన్ అందక పేదలు నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ దుకాణాల్లో బియ్యంతోపాటు చక్కెర, గోధుమపిండి, రాగిపిండి, రాగులు ,కంది పప్పు తదితర వస్తువులను పంపిణీ చేశారు. చిరుధాన్యాలు సైతం కార్డుదారులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్డుదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

తిప్పుకుంటున్నారు



రేణిగుంటలోని వినాయకనగర్‌లో నివసిస్తున్నాం. మా కుమారుడు ఏ. నిఖిలేశ్వర్ మానసిక స్థితి సక్రమంగా లేదు. 100శాతం వికలత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. అయితే పింఛన్ మాత్రం మంజూరు కాలేదు. రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. మా బిడ్డ వైద్యం కోసం రూపాయి కూడా ఖర్చు పెట్టలేని స్థితిలో ఉన్నాం. పింఛన్ ఇప్పిస్తే.. ఆ డబ్బులతో వైద్యం చేయించుకుంటాం.

– కుమారుడితో స్వాతి, రేణిగుంట

న్యాయం చేయండి



తిరుపతిలోని అబ్బన్నకాలనీలో నివసిస్తున్నా. నా భర్త షేక్ హుసేన్ బాషా గతంలో పింఛన్ తీసుకునేవాడు. 8 నెలల క్రితం మృతి చెందాడు. నాకు ఏ ఆధారం లేదు. భర్త పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే ఆ పింఛన్ భార్యకు ఇస్తామని చెప్పారు. అయినా ఇప్పటికీ మంజూరు చేయలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా నాకు న్యాయం చేయండి.

– షేక్ అమినాబీ, తిరుపతి

ప్లకార్డులు చేతపట్టి..
పింఛన్లు పంచిపెట్టి..

మహోన్నత లక్ష్యంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా నిర్వీర్యం చేస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా కక్షగట్టి వేధింపులకు గురిచేస్తోందని మండిపడుతున్నారు. సర్కారు వైఖరికి నిరసనగా బుధవారం నుంచి సమ్మె బాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు నోటీసులు సైతం అధికారులకు అందించారు. అయితే పేదలను ఇబ్బంది పెట్టకూడదనే సదుద్దేశంతో సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈక్రమంలోనే ప్లకార్డులను చేతపట్టి తమ ఆందోళనను వెలిబుచ్చారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. పాలకులు పెడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేశారు.

- సామాజిక పెన్షన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగుల నిరసన
- కూటమి ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం
- జిల్లావ్యాప్తంగా నల్లబాడ్జీలు ధరించి విధులు



ప్లకార్డులతో పింఛన్ల పంపిణీకి బయలుదేరిన సచివాలయ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : సచివాలయ ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కొంతకాలంగా పోరాటం సాగిస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ అంశంపై ఇప్పటికే జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు అందించారు. అయితే పింఛన్ల ప్రక్రియ నేపథ్యంలో పేదలకు ఇబ్బందులు కలగకుండా ఉండడం కోసం బుధవారం నల్లబాడ్జీలను ధరించి ప్లకార్డులను చేతపట్టుకుని నినాదాలు చేస్తూ విధులు నిర్వర్తించారు. ఈవిషయం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

నినాదాలు చేస్తూనే..

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ సచివాలయ ఉద్యోగులు నినాదాలు చేస్తూనే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ క్రమంలో డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లె మండలాల్లో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పింఛన్ల ప్రక్రియ మొదలుపెట్టారు. అలాగే పుత్తూరు, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి మున్సిపాలిటి పరిధిలోను 10 గంటలపైన పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సాధారణంగా ఉదయం 7గంటల నుంచి పెన్షన్ల పంపిణీ మొదలుపెట్టాల్సి ఉంది. అయితే సచివాలయ ఉద్యోగులు పోరుబాట వైపు అడుగులు వేస్తున్న క్రమంలో ఆలస్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం గంటల కొద్ది పడిగాపులు కాయాల్సి వచ్చింది. దీనిపై డీఆర్‌డీఏ అధికారులతోపాటు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లుకు సమాచారం అందడంతో వారు సచివాలయ ఉద్యోగులను బుజ్జగించి పెన్షన్ల పంపిణీకి పంపినట్లు తెలిసింది.







ప్లకార్డులను పట్టుకుని పింఛన్లు పంపిణీచేస్తున్న సచివాలయ సిబ్బంది

పనిభారం తగ్గించాలి

పనిభారం తగ్గించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. వలంటీర్ల పనులు అప్పగించడంపై మండిపడుతున్నారు. సర్వేలతో సతమతమవుతుంటే జీఎస్టీపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ప్లకార్డులను చేతపట్టుకుని నిరసన తెలియజేశారు.

మూడో స్థానానికి..

సెప్టెంబర్‌లో పింఛన్ల పంపిణీకి సంబంధించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అయితే సచివాలయ ఉద్యోగుల నిరసన కారణంగా ఈ నెల తొలిరోజు 94.81శాతం మందికి మాత్రమే పింఛన్ పంపిణీ చేశారు.దీంతో రాష్ట్రంలో జిల్లా మూడో స్థానంలోకి జారింది.

క్లుప్తంగా

నీటి గుంతలో పడి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

చిల్లకూరు : గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో బుధవారం ఓ యువకుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. వివరాలు.. స్థానిక రాణీపేటకు చెందిన అత్తివరం, రవీంద్ర (23) కొంత మంది స్నేహితులతో కలసి అండర్ బ్రిడ్జి వద్ద గుంతలో ఈతకొట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

పాకాల : మండలంలోని దామలచెరువులో బుధవారం బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. మొగరాల పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన రఘు(63) రోడ్డు దాటుతుండగా పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రఘు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా పడి ఒకరి మృతి



నదిలో కారు



మురళి (ఫైల్)

తిరుపతి రూరల్ : మండలంలోని చిగురువాడ వద్ద స్వర్ణముఖినదిలో కారు బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, కిచ్చమనాయుడుపల్లెకు చెందిన కంకలపాటి మురళి (42) తిరుపతిలో నివసిస్తున్నాడు. అయితే వ్యాపారం రీత్యా కార్వేటినగరంలో ప్రొవిజన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. నిత్యం తిరుపతి నుంచి కార్వేటినగరానికి వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కారులో తిరుపతికి వస్తుండగా చిగురువాడ బ్రిడ్జి వద్ద టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి స్వర్ణముఖి నదిలోకి దూసుకు వెళ్లింది. అదే సమయంలో అటుగా వచ్చిన కేసీపేట సర్పంచ్ పినాకపాణి మరికొందరి సాయంతో మురళిని బయటకు తీసి 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవం.. వెంకన్న రథోత్సవం

- వేడుకగా అశ్వవాహన సేవ
- ఆకట్టుకున్న కళా ప్రదర్శన



రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



రథం లాగుతున్న వేద పాఠశాల విద్యార్థులు



రథోత్సవంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్ : మండలంలోని తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఎనిమిదవ రోజైన బుధవారం ఉదయం రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా అలంకార మండపం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చారు. భక్తిశ్రద్ధలతో రథోత్సవం నిర్వహించారు. బ్రహ్మరథంపై ఊరేగుతున్న బ్రహ్మాండ నాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. రథంపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లి కర్పూర హారతులు సమర్పించారు. చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తర్వాత ఆలయంలోని కల్యాణ మండపంలో దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

అలరించిన కోలాటం, భజనలు

రథోత్సవంతో పాటు అశ్వవాహన సేవల్లో కళాకారులు, భజన బృందాలు అలరించాయి. వృషభాలు ముందు నడుస్తుండగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అశ్వవాహనంపై కల్కీ అవతారం



అశ్వవాహనంపై కల్కి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి అశ్వవాహనంపై శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కల్కి అవతారంలో భక్తులను కటాక్షించారు. అంతకు ముందు స్వామి, అమ్మవార్ల ఊంజల సేవ జరిపించారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి



తడ : నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న మెమో రైలు నుంచి జారి పడి బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. రైలు ఎక్కే యత్నంలో ప్రమాదవశాత్తు జారి పట్టాలపై పడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసుల శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఐద్వా జిల్లా కమిటీ ఎంపిక



ఈశ్వరమ్మ, సాయిలక్ష్మి

తిరుపతి కల్చరల్: ఐద్వా జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా బుధవారం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షురాలిగా కె.ఈశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్.సత్య, సుజాతమ్మ, సహాయ కార్యదర్శిగా రాధమ్మ, కోశాధికారిగా ఎం.జయంతి, ఐదుగురు కమిటీ సభ్యులు నియమితులయ్యారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్!

- ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్
- రూ.24 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి రూరల్ : తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు చోరీలకు పాల్పడిన ఏడుగురు దొంగలను తిరుచానూరు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.24లక్షల విలువైన 240గ్రాముల బంగారం, ఒకటిన్నర కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చంద్రగిరి డీఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచారి వివరాలు వెల్లడించారు. తుడా క్వార్టర్స్ ఎంఐజీ ప్లాట్ నంబరు 87లో సెప్టెంబర్ 10వ తేదీన చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వేట ప్రారంభించారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు ఎం.అరుణ, జగన్నాథరెడ్డి, సాయినాథ్ చౌదరి దర్యాప్తు చేపట్టారు. ఆ ఇంటి వద్ద దొరికిన వేలిముద్రల ఆధారంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని క్రైమ్ బ్రాంచి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం తలుపులు మూసి తాళం వేసియున్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడే ఈ ముఠా ఆచూకీని కనిపెట్టారు. ఆ ముఠాలో 7మంది సభ్యులను తిరుచానూరు పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ప్రధానంగా పశ్చిమ గోదావరి జిల్లా కోయలగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్, అతడి భార్య తోట వరలక్ష్మి, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం మాదవరంపోడుకు చెందిన సూరేపల్లి వెంకటేష్, కడపటౌన్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన గొడుగు అజీజ్, రైల్వేకోడూరు మండలం, మాధవరం పోడుకు చెందిన చిన్నమేకల దేవి, పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మర్లోతు గాయత్రి, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కంట్లం గ్రామానికి చెందిన కొవ్వాసి రాధాకృష్ణ ఉన్నారు. వీరిలో తోట శివకుమార్ మీద 150కి పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు ఛేదనకు కృషి చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు క్రైమ్ పార్టీ సిబ్బంది టి.ప్రభాకర్, వీఎల్ఎన్ ప్రసాద్, ఎం.ప్రసాద్, ఆర్.షఫీని ఎస్పీ సుబ్బ రాయుడు, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి అభినందించారు. నగదు రివార్డులను ప్రకటించారు.



పట్టుబడిన ఆభరణాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి తదితరులు

కక్ష సాధిస్తే.. ఉధృత ఉద్యమం

- డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన
- ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం

తిరుపతి తుడా : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులతో ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కోవిడ్ సమయంలో ప్రాణాలు తెగించి సేవలందించామని గుర్తు చేశారు. గ్రామీణులకు విశేషంగా వైద్యం అందిస్తున్న తమను వేధించడం సరికాదని మండిపడ్డారు. చిత్తశుద్ధితో విధులు నిర్వరిస్తున్న తమకు మరిన్ని వసతులు, అలవెన్సులు కల్పించకుండా, ఉన్న వాటిపై కోత పెట్టడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యుల ఆందోళనకు రుయా మెడికల్ ఆఫీసర్లు మద్దతు ప్రకటించారు.



పీహెచ్‌సీ వైద్యులకు మద్దతు ప్రకటిస్తున్న రుయా అసిస్టెంట్ ఆర్ఎంఓ హరికృష్ణ

85, 99 జీఓలను రద్దు చేయాలి



సర్వీస్‌లో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు గతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్స్ ఉండేది. ప్రభుత్వం జీఓ నంబర్ 85 ద్వారా ఈ కోటాను 15- 30 శాతానికి కుదించేసింది. అలాగే ఈ ఏడాది ఇచ్చిన జీఓ నంబర్ 99 ద్వారా ఆరు బ్రాంచ్‌ల నిబంధన తీసుకువచ్చింది. దీని ప్రకారం15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా బ్రాంచ్‌లకు మాత్రమే వర్తిస్తుంది. మిగిలిన వైద్యులకు అన్యాయం జరుగుతుంది. ఈ జీఓలను వెంటనే రద్దు చేయాలి.

– డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

డిమాండ్లను పరిష్కరించాలి



పీహెచ్‌సీ వైద్యులకు జరుగుతున్న అన్యాయంపై ఏడాదిగా ప్రశ్నిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎంబీబీఎస్ చదివి వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి అనేక షరతులు పెట్టింది. రూ 50 లక్షల ష్యూరిటీ ఇవ్వాలని, కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హోదాలో పని చేస్తామంటూ బాండ్ ఇవ్వాలని నిబంధన పెట్టడం దారుణం. వైద్య వృత్తికి ఇది ఏమాత్రం మంచిది కాదు. ఒరిజినల్ సర్టిఫికెట్లను కూడా ప్రభుత్వం తన వద్ద హామీగా పెట్టుకునేలా పెట్టిన నిబంధన బాధాకరం. మా న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

– అభిజ్ఞ, పీహెచ్‌సీ వైద్యులు

కనీస వసతులు లేవు



పీహెచ్‌సీ వైద్యులకు 25 ఏళ్లుగా ఉద్యోగోన్నతులు లేకుండా చేశారు. సీఏఎస్ కేడర్‌తోనే రిటైర్డ్ అయ్యే దుస్థితి తీసుకువచ్చారు. క్లినికల్ , నాన్ క్లినికల్ రిజర్వేషన్లను పెంచకపోగా మరింత కుదించడం ఇతర రాష్ట్రాల్లో జరగలేదు. 104 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోసేవలు అందించే వైద్యులకు మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కూడా కల్పించడం లేదు. అయినప్పటికీ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. మహిళా డాక్టర్లు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. డిమాండ్లను పరిష్కరించాలని కోరినందుకు ప్రభుత్వం కక్షపూరితంగా కొత్త నిబంధనను తీసుకురావడం దారుణం.

– ద్వైత, పీహెచ్‌సీ వైద్యులు

శ్మశాన వాటిక పరిరక్షణే లక్ష్యం

- కబ్జాకు స్కెచ్ వేసిన డిప్యూటీ మేయర్ మునికృష్ణ
- కార్పొరేషన్ కార్యాలయం, మునికృష్ణ ఇంటిని ముట్టడిస్తామన్న వైఎస్సార్ సీపీ నాయకులు

తిరుపతి తుడా: దశాబ్దాల నాటి శ్మశాన వాటికను కబ్జాకోరుల నుంచి కాపాడుకుంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకటించారు. శ్మశాన వాటిక ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంపై నిరసిస్తూ బుధవారం మారుతినగర్ శ్మశానవాటిక వద్ద వైఎస్సార్ సీపీ తిరుపతి యువజన విభాగం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. యువజన విభాగం నగర అధ్యక్షుడు దినేష్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసుయాదవ్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్ తదితరులు మాట్లాడారు. దొడ్డిదారిని డిప్యూటీ మేయర్ అయిన ఆర్‌సీ మునికృష్ణ అధికారం అడ్డు పెట్టుకుని శ్మశానవాటిక కబ్జాకు యత్నించడం శోచనీయమన్నారు. శ్రీనివాసులు నాయుడు అతని భార్య పేరుతో రెండు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, శ్మశాన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, అన్ని రాజకీయ పార్టీలతో పాటు ఎంఆర్ పల్లె, మారుతి నగర్ పరిసర ప్రాంత ప్రజలను ఏకం చేసి శ్మశాన స్థలం పరిరక్షణకు కార్పొరేషన్ కార్యాలయాన్ని, డిప్యూటీ మేయర్ ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించారు. అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ వంశీ, నాయకులు మల్లం రవి, కిషోర్ రెడ్డి, కోటి, పద్మ, అఖిల్, దామా షణ్ముఖం తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటిక వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు

థ్యాంక్యూ కలెక్టర్ సార్..!



తిరుపతి అర్బన్: ఆటోనగర్‌లోని 338 స్థలాలను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో కలెక్టర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మో.. మృగాళ్లు

- గ్యాంగ్‌రేప్ నిందితులకు బిగుస్తున్న ఉచ్చు
- కీలకమైన ఆధారాలు సేకరించిన పోలీసులు
- ఘటనా స్థలంలో ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ బృందాలతో జల్లెడ
- ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న ఖాకీలు
- ఆ మృగాళ్ల ఫోన్లలో వీడియోల తనిఖీ.. ఎఫ్ఎస్ఎల్‌కు తరలింపు



చిత్తూరు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్తూరు నగరంలో బాలికపై సామూహిక లైంగికదాడి కేసులో నిందితులు చేసిన పాపానికి ఉచ్చు బిగుస్తోంది. నేరం చేస్తే ఎవరూ నోరు విప్పరనే ధైర్యంతో ఉన్న ఆ ముగ్గురూ.. చేసిన నేరాన్ని సాక్ష్యాలతో సహా న్యాయస్థానం ఎదుట నిరూపించడానికి ఆధారాలు సేకరిస్తున్నారు. బుధవారం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌తో పాటు, తాలూక ఎస్ఐ మల్లికార్జున, ఫింగర్‌ప్రింట్ ఇన్‌స్పెక్టర్ సతీష్, తిరుపతిలోని ఫోరెన్సిక్ సైంటిఫిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) కేంద్రానికి చెందిన మహిళా అధికారి గ్యాంగ్‌రేప్ జరిగిన ఘటనా స్థలంలో పలు సాక్ష్యాలను సేకరించారు. దాదాపు రెండు గంటల పాటు పోలీసులు ఘటనా స్థలాన్ని జల్లెడ పట్టి, కీలకమైన ఆధారాలను సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం

నిందితులను పట్టుకునేప్పుడు స్థానికులపై తిరగబడటానికి ప్రయత్నిస్తే దేహశుద్ధి చేశారు. ఆపై నిందితులు తీసిన వీడియోలు బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిందితులు కిషోర్, మహేష్, హేమంత్ అఘాయిత్యం జరిగిన తీరును వివరిస్తున్నట్లుగా ఆ వీడియోల్లో తెలుస్తోంది. వీళ్లను పోలీసులకు అప్పగించే క్రమంలో నిందితులు ముగ్గురూ పారిపోగా.. తాజాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇక నిందితుల మొబైల్ ఫోన్లలో వీడియోల విషయం తేల్చడానికి వాటిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపనున్నారు. నిందితులను గురువారం అరెస్టు చూపించే అవకాశం ఉంది.

పార్కులో అటవీశాఖ భద్రత డొల్ల

ఈ ఘటనలో చిత్తూరు పశ్చిమ రేంజ్ అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పార్కులో ఎంట్రీ కోసం రూ.10 డిజిటల్ చెల్లింపుల ద్వారా వసూలు చేస్తున్న అధికారులు, ఇక్కడ సందర్శకుల భద్రత కోసం ఏ ఒక్క చర్య పాటించడంలేదు. దాదాపు 6 కి.మీ విస్తీర్ణం ఉన్న నగర వనంలో ఒక్కటంటే ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పైగా పార్కులో దట్టమైన రిజర్వు ఫారెస్టు (ఆర్ఎఫ్) కలిసి ఉంది. ఈ రెండింటినీ వేరుచేసే కంచె కూడా లేదు. దీనివల్ల వన్య మృగాలు సందర్శకులపై దాడి చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సందర్శకులు సైతం పార్కును దాటుకుని ఆర్ఎఫ్‌లోకి వెళితే, వాళ్లు బయటకు వచ్చారా..? లేదా కూడా తెలియదు. ఇక వాచర్లు, బీట్ అధికారులు పూర్తి సమయం ఇక్కడ ఉండటం లేదు. సందర్శకులకు కనీస భద్రత లేకుండా ఆఘమేఘాలపై నగరవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అధికారుల అత్యుత్సాహమే అవుతుంది. దీనిపై వెస్ట్ రేంజ్ ఎఫ్ఆర్‌వో పట్టాభి వివరణ ఇస్తూ.. ఆర్ఎఫ్ చుట్టూ కంచె ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, హెచ్చరిక బోర్డులు పెట్టామని, వాచర్లను కూడా పెట్టామంటూ చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు చెప్పుకొచ్చారు.



గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన నిందితులు, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సాయినాథ్, ఫోరెన్సిక్, ఫింగర్‌ప్రింట్ బృందాలు

మాటువేసి..కాటువేసి

గత నెల 25వ తేదీన బాలిక, ఆమె స్నేహితుడు కలిసి చిత్తూరు-తిరుపతి రోడ్డులో ఉన్న అటవీశాఖకు చెందిన నీవా నగరవనికి వెళ్లడం.. అక్కడ కిషోర్, మహేష్, హేమంత్ ముగ్గురూ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటం అయిదు రోజుల తరువాత వెలుగులోకి వచ్చింది. అయితే నిందితులు ముగ్గురికీ నీవా నగర వనంపై పూర్తి పట్టు ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బాలిక, ఆమె స్నేహితుడు లోపలికి వెళ్లగానే వాళ్లను వెనక నుంచి నిందితులు ముగ్గురూ వెంబడించారు. ఓ చోట ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటుండగా అప్పటికే మాటు వేసిన నిందితులు చుట్టూ ఎవరూ లేరని నిర్ధారించుకున్నారు. తొలుత తమను అటవీశాఖ సిబ్బందిగా చెప్పుకున్న నిందితులు, బాధితులు ఇద్దరినీ ఓ గుట్టపై ఉన్న నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లారు. అప్పటికే తమ వద్ద ఉన్న కత్తులు చూపించి బాలికపై ఒకరి తరువాత ఒకరు అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈ సమయంలో బాలికతో వచ్చిన యువకుడు ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తే అతడిపై విచక్షణారహితంగా దాడిచేసి, నోరుమూసి పెట్టి చంపడానికి ప్రయత్నించారు. చివరగా వెళ్లేప్పుడు యువకుడి బంగారు చైనును లాక్కెళ్లారు. ఈ మొత్తం ఘటనలో కొన్ని నిముషాల వీడియో నిందితుల మొబైల్ ఫోన్లలో చిత్రీకరించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల తరువాత గాయపడ్డ యువకుడు జరిగిన విషయం తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఆపై వారు నిందితుల కోసం గాలించి, గత నెల 29వ తేదీన వాళ్లను పట్టుకుని దేహశుద్ధి చేశారు.